సాక్షి నల్లగొండ

బుధవారం । 15 । మార్చి । 2023



రేషన్ బియ్యం పట్టివేత

చిట్యాల మండలం వనిపాకలలో అక్రమంగా నిల్వ ఉంచిన 280 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. - 8లో



మోదీ పాలనలో..

మోదీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ధ్వజమెత్తారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 37°/19°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కంటి వెలుగు శిబిరం తనిఖీ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నకిరేకల్ : పట్టణంలోని మూసీ రోడ్డులో రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటి వెలుగు పరీక్షల కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడారు. వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ ప్రసాద్‌నాయక్, ఎన్నికల విభాగం తహసీల్దార్ పాట్టబత్తుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'పేపర్ లీకేజీకి ప్రభుత్వానిదే బాధ్యత'

నల్లగొండ : పోటీ పరీక్షల పేపర్ లీకేజీ అయిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లక్షలాది మంది నిరుద్యోగులు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకుని పరీక్షలు రాస్తే కొందరు అక్రమ మార్గంలో ఉద్యోగాలు సాధించేందుకు పేపర్ లీకేజీకి పాల్పడి పరీక్షల రద్దుకు కారణమయ్యారని మండిపడ్డారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. అన్ని పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

భూ నిర్వాసితులకు పరిహారం అందించాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని నర్సాపురం గ్రామ పరిధిలో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో భాగంగా రైల్వే లైన్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న నిర్వాసితులకు వెంటనే పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం దామరచర్ల మండలంలోని నర్సాపురం గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ రైల్వే లైన్ పనులు ప్రారంభించి సంవత్సరం కావొస్తున్నా ఇప్పటివరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఒక్క ఎకరాకు కూడా నష్టపరిహారం అందించలేదని మండిపడ్డారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు ప్రత్యక్ష పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వినోద్ నాయక్, సీనియర్ నాయకులు పాపానాయక్, రైతులు బాలు, వినోద్, రఘు, శివ, శ్రీను, మేశ్యా, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

చిట్యాల : మండలంలోని చిట్యాల, ఉరుమడ్ల గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లను రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుడు మాదగోని శంకరయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పాఠశాల్లోని విద్యార్థుల అభ్యసన తీరును తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక విద్యాబోధన చేయాలని సూచించారు. తన స్వగ్రామమైన ఉరుమడ్ల పాఠశాలలో పదో తరగతిలో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి నగదు బహుమతులను అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు గోగికార్ మాధవి, ఈ.దేవపాల, ఉపాధ్యాయులు స్వామి, లతీఫ్, నాగయ్య, నజీర్ ఉన్నిసా, కోనేటి కృష్ణ, మహేశ్వరి పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

మునుగోడు : మండలంలోని జమస్థాన్‌పల్లి, పలివెల గ్రామాల్లో నర్సరీలతోపాటు హరితహారంలో నాటిన మొక్కలను జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి, మునుగోడు మండల ప్రత్యేక అధికారి ఏ.యాదగిరి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మాసంలో చేపట్టే హరితహారం కార్యక్రమానికి అవసరమైన మొక్కలను నర్సరీల్లో పెంచాలని సూచించారు. గతంలో నాటిన మొక్కలకు వారంలో రెండుమార్లు నీరు పోయించాలని ఆదేశించారు. వేసవిలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా మొక్కలు చనిపోయే అవకాశం ఉంటుందని, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మొక్కలు చనిపోకుండా కాపాడాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ సుమలత, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

పాస్ పుస్తకాలలో దిద్దీ..

దామరచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మూడున్నర ఎకరాలు ఆక్రమణ

- ఆ భూమి చదునుచేసి ప్లాట్ల అమ్మకం
- ఇప్పటికే అక్కడ వెలసిన అక్రమ నిర్మాణాలు
- అధికారులు రాజకీయ ఒత్తిడికి తలొగ్గుతున్నారని ఆరోపణలు
- రూ.కోట్ల విలువైన భూమిని కాపాడాలని ప్రజల డిమాండ్

తహసీల్దార్ కార్యాలయం అంటే ఆ మండలానికి సంబంధించిన సమస్త భూముల సమాచారం అక్కడే ఉంటుంది. భూ సంబంధ విషయంలో ఏ సమస్య వచ్చినా అక్కడికి వచ్చి పరిష్కరించుకోవాల్సిందే. మండల పరిధిలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా వాటిని కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులదే. విచిత్రం ఏమిటంటే ఆ కార్యాలయం ఎదురుగా ఉన్న మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. నకిలీ పాస్‌పుస్తకం సృష్టించి ఆ భూమి మాదేనంటూ చదును చేసి విక్రయాలు జరుపుతున్నారు. రోజూ ఆ ప్రాంతాన్ని చూసుకుంటూ వెళ్లే అధికారులు అసలు ఆ భూమి ప్రభుత్వానిది కాదన్నట్లుగా వ్యవహరించారు. ఇలా దామరచర్ల మండలంలో రూ.కోట్ల రూపాయల విలువైన భూమి ఆక్రమణకు గురవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గల సర్వే నంబర్ 825 కింద మొత్తం 150.33 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 1995 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పేద రైతులకు సాగు చేసుకునేందుకు ఆ భూమిని అప్పగించింది. అందులోనే రైల్వేలైన్, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మార్కెట్ యార్డు, గురుకుల పాఠశాలల కోసం సుమారు 70 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఆయా కార్యాలయాల నిర్మాణం పూర్తి కాగా.. మిగిలిన భూములను ఆక్రమణదారులు కబ్జా చేస్తున్నారు. ఇప్పటికే భూసేకరణలో భూమి కోల్పోయి పరిహారం పొందిన వారి పాత పాస్ పుస్తకాలను ఆధారంగా చూపించి.. ఆ భూములు మావేనంటూ ఆక్రమిస్తున్నారు. ఇలా ఈ మండలంలో ప్రభుత్వ భూమిని చాలా వరకు అన్యాక్రాంతమైంది. అధికారులు రాజకీయ ఒత్తిడికి తలొగ్గి ఏమీ చేయలేక చేష్టలుడిగి చూస్తున్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట అక్రమ కట్టడాలు.

ఆక్రమించారు ఇలా..

దామరచర్ల మండల కేంద్రానికి చెందిన జానపాటి నాగయ్య బీబీనగర్ – నడికుడి రైల్వేలైన్ నిర్మాణంలో భూమిని కోల్పోగా పరిహారం అందింది. నాగయ్య పేరిట అప్పట్లో ఉన్న పాతపాస్ పుస్తకంలో సర్వే నంబర్ 825/30లో భూమి ఉందని చూపించి ఆక్రమించారు. ఆ పాస్ పుస్తకంలో మొత్తం చెరిపివేతలు, పొంతన లేకుండా సంతకాలు చేసినట్లుగా ఉంది. వైట్‌నర్‌తో దిద్ది సంతకాలు, తేదీలు మార్చినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు ఆ భూమిని ఏకంగా చదును చేసి విక్రయిస్తున్నారంటే.. ఇందులో ఎంతమంది భాగస్వామ్యముందో ఇట్టే తెలుసుకోవచ్చు.



దిద్దిన పాస్‌పుస్తకం

ఒక గుంట స్థలం రూ.15 లక్షలు..

ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూమిని ఇతరులకు విక్రయించడం చట్ట విరుద్ధం. కేవలం అనుభవించడానికి మాత్రమే అవకాశం ఉంటుంది. కానీ దామరచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న మూడున్నర ఎకరాల భూమిని ప్లాట్లుగా మార్చి యథేచ్ఛగా అమ్మకానికి పెట్టారు. అక్కడ ఒక గుంట స్థలాన్ని రూ.15 లక్షల చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. ఎలాంటి అనుమతులు లేకుండా.. విక్రయించే ఈ స్థలాల్లో నిర్మాణానికి కూడా అనుమతులు తీసుకోవడం లేదని తెలుస్తోంది. ఆ స్థలంలో అనుమతి లేకుండా ఇప్పటికే రెండు దుకాణాలు, రెండు బెస్మెంట్లు కూడా కట్టారు. రాజకీయ ఒత్తిడి కారణంగానే అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఈ ఆక్రమణపై దృష్టి సారించి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రభుత్వ భూముల కబ్జాలపై సమగ్ర విచారణ జరిపి ఆక్రమణలు జరిగితే స్వాధీనం చేసుకుంటాం. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆక్రమణలకు పాల్పడిన వారిపై ఇప్పటికే నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పించాం. వారి ఆదేశానుసారం చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– గణేష్, తహసీల్దార్, దామరచర్ల

నోటీసులు అందజేశాం

తహసీల్దార్ కార్యాలయం ఎదుట అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు జారీ చేశాం. గ్రామ పంచాయతీ నుంచి కట్టడాల విషయంపై ఎవరికి అనుమతి కానీ, ఇంటి నంబర్ కానీ కేటాయించలేదు. అధికారుల ఆదేశానుసారం అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాం.

– పోతుగంటి దుర్గయ్య, పంచాయతీ కార్యదర్శి, దామరచర్ల

వేలానికి వేళాయే..

- రేపటి నుంచి 18వ తేదీ వరకు శ్రీవల్లి టౌన్‌షిప్ ప్లాట్ల వేలం
- ఇప్పటికే 3 విడతల్లో 230 ఓపెన్ ప్లాట్లు, 165 పాక్షిక నిర్మాణ గృహాల విక్రయం

నల్లగొండ : నల్లగొండ సమీపంలోని నార్కట్‌పల్లి మండలం మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎదురుగా రాజీవ్‌స్వగృహ శ్రీవల్లి టౌన్‌షిప్‌లోని ఓపెన్ ప్లాట్లు, పాక్షిక నిర్మాణ గృహాల అమ్మకానికి జిల్లా యంత్రాంగం 4వ విడత వేలానికి సిద్ధమైంది. ఈ నెల 16, 17, 18 తేదీల్లో కలెక్టరేట్‌లో వేలం నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వేలం ఉంటుంది. వేలంలో పాల్గొనే వారు మొదట రూ.10 వేలు డీడీ తీసి వేలంలో ప్లాటు లేదా పాక్షిక నిర్మాణ గృహాలను కొనుగోలు చేయొచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ఇప్పటికే 3 విడతల్లో వేలం..

ప్రభుత్వ వెంచర్ అయిన రాజీవ్‌స్వగృహ శ్రీవల్లి టౌన్‌షిప్‌లో మొత్తం 363 ఓపెన్ ప్లాట్లు, 418 పాక్షిక నిర్మాణ గృహాలను వేలం ద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఓపెన్ ప్లాటుకు గజం ధర రూ.6 వేలు, పాక్షిక నిర్మాణ గృహాలకు గజానికి రూ.10,500గా ధర నిర్ణయించారు. 3 విడతల్లో నిర్వహించిన వేలంలో మొత్తం 230 ఓపెన్‌ప్లాట్లు, 165 పాక్షిక నిర్మాణ గృహాలను విక్రయించారు. మిగిలిన ప్లాట్ల విక్రయానికి 4వ విడత వేలం నిర్వహిస్తున్నారు.



శ్రీవల్లి టౌన్ షిప్‌లో ప్లాట్లు

రెండుసార్లు ప్రీ బిడ్ సమావేశాలు..

రాజీవ్ స్వగృహ ప్లాట్లు, పాక్షిక నిర్మాణ గృహాల విక్రయానికి అధికారులు పడరానిపాట్లు పడుతున్నారు. ఇప్పటికే నిర్వహించిన మూడు సార్లు వేలం నిర్వహించగా.. పూర్తిస్థాయిలో అమ్ముడుపోలేదు. ఈ నెల 16 నుంచి 3 రోజులపాటు వేలానికి సంబంధించి.. ఇప్పటికే రెండుసార్లు ప్రీ బిడ్ సమావేశాలు నిర్వహించారు. ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు సమావేశాలకు హాజరయ్యారు. జిల్లా అధికారులు, ఉద్యోగులు, వ్యాపారులు కొనుగోలు చేసే విధంగా అవగాహన కల్పించారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

నల్లగొండ : నేటి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయని డీఈఓ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 23వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని.. 24వ తేదీ నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

పనులను పర్యవేక్షించాలి

- అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నల్లగొండ : గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మండలస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి జిల్లాస్థాయి అధికారులకు నివేదికలు పంపించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో రోజూ 100 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాల కోసం స్థలాలను గుర్తించని గ్రామాల్లో వెంటనే స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, డీఆర్‌డీఓ అదనపు పీడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

జీతాలివ్వండి మహాప్రభో..!



విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు

- ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలకు ఏడు నెలలుగా అందని వేతనాలు
- కుటుంబాలు గడవడం లేదంటూ ఆవేదన

నల్లగొండ టౌన్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న ఏఎన్ఎంలకు ఏడు నెలలుగా వేతనాలు రాలేదు. అప్పులు చేసుకుని కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే అరకొర వేతనాలు అయినా నెలనెలా ఇచ్చేలా చర్యలు తీసుకుని తమ ఇబ్బందులను తొలగించాలని అధికారులను కోరుతున్నారు.

96 మంది ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలు

గ్రామీణ స్థాయిలోని ప్రజలకు వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ పద్ధతిన గతేడాది ఏఎన్ఎంలను నియమించింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 96 మంది ఏఎన్ఎంలను ఒక ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించింది. అప్పట్లో ఆ ఏజెన్సీపై పలు ఆరోపణలు రావడంతో ఆ ఏజెన్సీని తొలగించినట్లు తెలిసింది. దాని కారణంగా ఏఎన్ఎంలకు సకాలంలో వేతనాలు అందని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నాలుగు నెలలకు సంబంధించిన బిల్లులను వైద్య ఆరోగ్యశాఖ పంపించినట్లు సమాచారం. కానీ, ట్రెజరీలో ఇప్పటి వరకు బిల్లులు పాస్ కాకపోవడంతో ఏఎన్ఎంలకు వేతనాలు అందని పరిస్థితి ఏర్పడింది. ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడతో ఇంటిఅద్దెలు, పిల్లల చదువుల ఫీజులు, ఇతర నిత్యావసర వస్తువులు కొనుగోలు కోసం అందిన కాడ అప్పుడు చేయాల్సి వస్తోందని ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు ఆవేదన చెందుతున్నారు.

బిల్లు పాస్ కాగానే వేతనాలను ఇస్తాం

నాలుగు నెలల వేతనాలకు సంబంధించి బిల్లులను ట్రెజరీకి పంపించామని ట్రెజరీలో బిల్లు పాస్ కాకపోవడంతో వేతనాలను అందించలేకపోయాం. బిల్లు పాస్ కాగానే వేతనాలను ఇస్తాం.

– డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్ఓ

గొర్రెలు పంపిణీ చేయాలి

- జీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్

నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గొర్రెల పంపిణీ పథకాన్ని పునః ప్రారంభించాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండ దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. గొర్రెల కాపరులను అభివృద్ధి చేస్తామని చెప్పిన ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాల్సిన గొర్రెల పంపిణీ పథకాన్ని ఆరు సంవత్సరాలైనా మొదటి విడత లబ్ధిదారులకు కూడా పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకంలో దళారీ వ్యవస్థ లేకుండా పారదర్శకంగా అమలు చేయడానికి విధివిధానాలు రూపొందించాలని కోరారు.



సదస్సులో మాట్లాడుతున్న కిల్లె గోపాల్

జిల్లా కమిటీ ఎన్నిక

జీఎంపీఎస్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుంటి గొర్ల నాగరాజు, అధ్యక్షుడిగా సాగర్ల మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా అవిశెట్టి శంకరయ్య, మరో 15 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం జిల్లా మాజీ కార్యదర్శి బండా శ్రీశైలం, వృత్తి సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ గంజి మురళీధర్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా వెంకన్న, రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెరుకు పెద్దలు నల్లవెల్లి స్వామి, గంట వెంకన్న, రెండాల ఆనంద్, జాల ఆంజనేయులు, మల్లయ్య, నరసింహ, నరేష్, చిరబోయిన శ్రీశైలం, నరసింహ, మైల సత్తయ్య పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా.. నోఎంట్రీ

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు
- 47 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 30,676 మంది విద్యార్థులు

నల్లగొండ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు పరీక్ష సమయానికి నిమిషం ఆలస్యంగా వస్తే పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. గంట ముందుగానే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని చెబుతున్నారు. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు మొదటి సంవత్సరం 14,915 మంది, ద్వితీయ సంవత్సరం 15,761 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్..

పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సౌకర్యాలు కల్పించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో అబ్జర్వర్‌గా డిప్యూటీ తహసీల్దార్‌ను నియమించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ విధించడంతోపాటు పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను కూడా మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. పరిసర గ్రామాల నుంచి పరీక్ష కేంద్రాలకు వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు 19 రూట్లలో బస్సులు నడిపిస్తున్నారు. విద్యార్థులు ఫీజు కట్టలేదనే సాకుతో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు హాల్‌టికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడితే ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావొచ్చని అధికారులు సూచిస్తున్నారు.



నంబర్లు వేసే విధానాన్ని పరిశీలిస్తున్న డీఐఈఓ దస్రూనాయక్

జిల్లాలో 47 పరీక్ష కేంద్రాలు..

పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 47 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 12 ప్రభుత్వ కళాశాలలు, 3 మోడల్ స్కూళ్లు, 10 గురుకుల పాఠశాలలు, 22 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. 477 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 47 మంది డీఓలు, 8 మంది కస్టోడియన్లు, ఇద్దరు ఫ్లైయింగ్, 4 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించారు.

అదనపు కలెక్టర్ సమీక్ష

పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై నల్లగొండ తహసీల్దార్ కార్యాలయంలో ఇంటర్మీడియట్ అధికారులతో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. కోమటిరెడ్డి ప్రతీక్ కళాశాలలో కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్ల వేసే పద్ధతిని డీఐఈఓ దస్రూనాయక్ పరిశీలించారు.

ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

హాలియా : ప్రభుత్వ పాఠశాలలను 'మన ఊరు –మన బడి' నిధులతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. అనుముల మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.34.25 లక్షల వ్యయంతో చేపడుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో కొన్ని పనులు ప్రగతిలో ఉన్నాయని పంచాయతీ రాజ్ డీఈ రామాంజనేయులు, ఏఈ సాయిప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. పనులు సత్వరమే పూర్తి చేసేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం హాలియాలోని 4వ వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కంటి వెలుగు శిబిరాల్లో మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. నర్సరీలను పరిశీలించి.. జూన్ నాటికి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. ఆయన వెంట హాలియా మున్సిపాలిటీ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి, ఎంపీడీఓ లక్ష్మి, తహసీల్దార్ మంగ, ఎంఈఓ బాలునాయక్, పంచాయతీరాజ్ డీఈ రామాంజనేయులు, ఏఈ సాయిప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఎంపీడీఓ కార్యాలయం పరిశీలన

నిడమనూరు : నిడమనూరు ఎంపీడీఓ కార్యాలయాన్ని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈజీఎస్ పనులపై సమీక్షించారు. హరితహారంలో నాటిన మొక్కలను రక్షించాలని, క్రీడా మైదానాల ఏర్పాటు, ఇతర పనులను వంద శాతం పూర్తి చేయాలని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ ప్రమీళ, ఏపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం ఆందోళన



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ఆందోళన చేస్తున్న దరఖాస్తుదారులు

- అర్హులకు కేటాయించాలని దరఖాస్తుదారుల డిమాండ్
- ఆందోళనలో సొమ్మసిల్లిన మహిళ

దేవరకొండ : పట్టణంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం పేదలు రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. అర్హులకు కాకుండా అనర్హులకు ఇళ్లను కేటాయించారని ఆరోపిస్తూ మంగళవారం ఆందోళన నిర్వహించారు. దేవరకొండ ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాసులు, తహసీల్దార్ రాజు డబుల్ బెడ్రూం ఇళ్ల వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టిన వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టినట్లు వారు తెలిపారు. సర్వే నిర్వహించి అనర్హులు ఎవరైనా ఉంటే విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. అయినప్పటికీ ఆందోళన చేపట్టిన దరఖాస్తుదారులు.. అధికారులు సర్వే నిర్వహించి తమకు ఇళ్లను కేటాయించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించి కూర్చున్నారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో భారతమ్మ అనే మహిళ సొమ్మసిల్లింది. దరఖాస్తుదారుల ఆందోళన నేపథ్యంలో డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద పోలీసులు బందోబస్తు చేపట్టారు. మంగళవారం పొద్దుపోయే వరకు అక్కడే ఉండి నిరసన తెలిపారు. చివరకు సర్వే నిర్వహించి అర్హులకు న్యాయం చేస్తామని రెవెన్యూ, పోలీసు అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



సొమ్మసిల్లి కింద పడిపోయిన మహిళ

క్లుప్తంగా

హైనా దాడిలో మూడు గొర్రెలు మృతి

రాజాపేట: మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామ శివారులో మంగళవారం హైనా దాడిలో మూడు గొర్రెలు మృతిచెందాయి. బాధితర రైతు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మక్కపల్లికి చెందిన నేతిగారి రమేష్ గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో ఇల్లు నిర్మించుకొని ఉంటూ అక్కడే గొర్రెలను పెంచుతున్నాడు. మంగళవారం తెల్లవారుజామున గొర్రెల మందపై హైనా దాడి చేసి మూడు గొర్రెలను చంపి ఓ గొర్రెను ఎత్తుకెళ్లింది. బాధితుడు గమనించి పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు రూ. 20వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొంటున్నాడు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

మాడుగులపల్లి: చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో మాడుగులపల్లి ఎస్ఐ కైగూరి నరేష్‌కుమార్‌తో కలిసి ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన సింగం రమేష్, చందనబోయిన వెంకటేష్, మంత్రి నాగరాజు జల్సాలకు అలవాటు పడి ముఠాగా ఏర్పడి కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నెల 7న మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దదేవులపల్లి రెడ్డీస్ ల్యాబరేటరీలో, అదే గ్రామంలో పలువురు రైతులకు చెందిన విద్యుత్ మోటార్ల వైర్లను చోరీ చేశారు. ఈ నెల 9న రైతులు జలంధర్, మైబెల్లి, గుండెబోయిన మట్టయ్య తమ మోటారు వైర్లు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ నరేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి 70 వేల విలువైన రాగి తీగను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

బావిలో పడి యువకుడు మృతి

నడిగూడెం: బావిలో పడి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని వల్లాపురం గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లాపురం గ్రామానికి చెందిన మొక్క వెంకటనర్సు, లక్ష్మమ్మ దంపతుల చిన్న కుమారుడు శ్రీకాంత్(28) ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా మంగళవారం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో శ్రీకాంత్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే బావి వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ ఘటనపై నడిగూడెం ఎస్ఐ ఏడుకొండలును సంప్రదించగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

- గుర్రంపోడు మండలం తేనపల్లి గ్రామ శివారులో స్కూల్ బస్సు ఢీకొని ఒకరు..
- తిరుమలగిరి మండలం తొండ గ్రామ సమీపంలో వ్యాన్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



శ్రీను మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



సంపత్ మృతదేహం

గుర్రంపోడు: స్కూల్ బస్సు ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని తేనపల్లి గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ శివప్రసాద్ తెల్పిన వివరాల ప్రకారం.. చండూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు మంగళవారం విద్యార్థులను దించేందుకు తేనపల్లి గ్రామానికి వస్తూ గ్రామ శివారులో ఎదురుగా బైక్‌పై వస్తున్న నాంపల్లి మండలం చామలపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల శ్రీను(23)ను ఢీకొట్టింది. దీంతో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు పెద్దవూర మండలం వెల్మగూడెంలో బొడ్రాయి పండగకు వెళ్లి వస్తూ.. తేనపల్లిలోని తన బావ ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఇద్దయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఆటో డ్రైవర్..

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మన్‌పహాడ్ గ్రామానికి చెందిన నూనె సంపత్(36) తన ఆటోలో తిరుమలగిరి నుంచి తొర్రూరు వైపు వెళ్తుండగా తొండ గ్రామ సమీపంలో ఎదురుగా వేగంగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంపత్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



మృతుడి బంధువుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ బాలకృష్ణ

చింతపల్లి: వేధింపులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం మండల పరిధిలోని కొత్రమాన్‌సింగ్‌తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్రమాన్‌సింగ్‌తండాకు చెందిన ఓ మహిళతో చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎర్ర శ్రీను వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తండాకు చెందిన కొత్ర లచ్చానాయక్(30) తెలియడంతో ఇరువురిని మందలించాడు. దీంతో సదరు మహిళ, ఎర్ర శ్రీనుతో పాటు మరో ఇద్దరు మహిళలు లచ్చానాయక్‌పై కోపం పెంచుకొని విషయాన్ని బయటికి చెప్తొద్దంటూ భయభ్రాంతులకు గురిచేసేవారు. వారి వేధింపులు భరించలేక లచ్చానాయక్ మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఇది గమనించిన బంధువులు వెంటనే అతడిని దేవరకొండ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల అదుపులో దారి దోపిడీ ముఠా?

నల్లగొండ క్రైం: రాత్రి సమయంలో రోడ్డు వెంట నిలిపిన లారీ డ్రైవర్లు, క్లీనర్లను బెదిరించి దారి దోపిడీకి పాల్పడుతున్న ఐదుగురు ముఠా సభ్యులను నల్లగొండ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. నల్లగొండ పట్టణ శివారులోని శేషమ్మగూడెం, కతాల్‌గూడెంతో పాటు హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు ముఠాగా ఏర్పడి దారి దోపిడీలకు పాల్పడుతున్నారని, వీరు ఇటీవల నల్లగొండ మున్సిపాలిటీ పరిధి పానగల్ సమీపంలోని అద్దంకి–నార్కట్‌పల్లి రోడ్డుపై నిలిపిన లారీ డ్రైవర్, క్లీనర్‌ను, దండంపల్లి–కట్టంగూర్ రోడ్డులో పానగల్‌కు వెళ్లే కాల్వ వద్ద నిలిపిన లారీ డ్రైవర్, క్లీనర్‌ను కత్తితో బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లినట్లు సమాచారం. చౌటుప్పల్ వద్ద హైవేపై కూడా ఇలానే దారి దోపిడీకి పాల్పడినట్లు నిందితులు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది. నిందితుల వివరాలను త్వరలోనే మీడియాకు వెల్లడిస్తామని నల్లగొండ టూటౌన్ పోలీసులు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో భక్తాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



బొడ్రాయికి పూజలు చేస్తున్న భక్తులు

మోత్కూరు: మండలంలోని రాగిబావి గ్రామంలో శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయం 11వ వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యావచనం, ఆంజనేయ స్వామికి సింధూరం, ఆకు పూజ, నవ గ్రహపూజ, రుద్రాభిషేకాలను పూజారి భాస్కరబట్ల శివానంద శర్మ నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు, బొడ్రాయికి మహిళలు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమాలు చేశారు. అనంతరం బొడ్రాయికి మహిళలు బోనాలతో వెళ్లి ప్రదర్శనలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంపాక నాగయ్య, ఉపసర్పంచ్ ఝున్నం యాదవరెడ్డి, మాజీ ఎంపీటీసీ పానుగుల్ల విష్ణుమూర్తి, వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జూలూరు పీఏసీఎస్‌లో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పీఏసీఎస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లో అక్రమాలు జరిగాయని గత ఏడాది ఆడిట్‌లో అధికారులు పేర్కొన్నారని తెలిపారు. అంతేకాక ఇటీవల స్వయంగా అధికార పార్టీకి చెందిన డైరెక్టర్లే జరిగిన అవినీతిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేనిచో మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. వెంటనే దుర్వినియోగమైన డబ్బును రికవరీ చేయాలని, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు గూడురు అంజిరెడ్డి, పగిళ్ల లింగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు అందెల జ్యోతి, బొబ్బల బాలకృష్ణారెడ్డి, గట్టు రాంరెడ్డి, ఉడుతల జంగయ్య, కందాడి యాదిరెడ్డి, బానాల ఎల్లారెడ్డి, నాయకులు మధు, బుచ్చిరెడ్డి, జంగయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం కాని ఇసుక పంచాయితీ



ఇసుక ఎత్తేందుకు వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్‌తో గొడవ పడుతున్న కొరటికల్ గ్రామస్తులు

మునుగోడు : కొంతకాలంగా మునుగోడు మండలంలోని కొరటికల్, కనగల్ మండలం రేగట్టె గ్రామ ప్రజల మధ్య కొనసాగుతున్న ఇసుక పంచాయితీ తారస్థాయికి చేరుకుంది. కొరటికల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని జిల్లాయిపేట చెరువులో ఇసుక మేట వేసింది. ఆ చెరువులోని ఇసుకను రేగట్టె గ్రామానికి చెందిన ఇసుక వ్యాపారులు దొంగచాటున ఎత్తుకెళ్తున్నారు. ఇదే అదునుగా భావించిన చండూరు మండలం పడమటితాళ్ల గ్రామ ప్రజలు కూడా ఇసుక ఎత్తుకెళ్లడం మొదలుపెట్టారు. గమనించిన కొరటికల్ గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు చెరువు వద్దకు వెళ్లి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిని అడ్డుకుని పోలీసులకు పట్టించే ప్రయత్నం చేశారు. మరొకమారు ఇసుక తీసుకెళ్లమని, తమను వదిలేయాలని బతిమిలాడటంతో కొరటికల్ గ్రామస్తులు అక్రమ వ్యాపారులను వదిలేశారు. అది గడిచి 10 రోజులు కాకముందే తిరిగి రేగట్టె గ్రామస్తులు మంగళవారం 10 ట్రాక్టర్లతో వచ్చి చెరువులో ఇసుక ఎత్తుతున్నారు. విషయం తెలిసిన కొరటికల్ గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లి ఇసుక ఎత్తే వారిపై గొడవకు దిగారు. దీంతో అక్రమ వ్యాపారులు వారిని ట్రాక్టర్లతో ఢీకొట్టే ప్రయత్నం చేసి పరారయ్యారు. రెండేళ్ల క్రితం వాగు సరిహద్దు విషయంలో పోలీసు ఎదుట దాడులు చేసుకుంటే ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ, ఆర్డీఓలు వాగు సరిహద్దును నిర్ణయించారు. ఇప్పటివరకు శాంతంగా ఉన్న ఇరు గ్రామాల ప్రజలు తిరిగి రెండు నెలలుగా తగువులు పడుతున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు చొరవ తీసుకొని ఇరు గ్రామాల మధ్య తగువులు జరగకుండా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాల్లో బండ్ల ఊరేగింపు



సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

నాగారం: ఫణిగిరిలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం బండ్ల ఊరేగింపు, గజసేవా, డోపోత్సవం, తీర్థప్రసాదాల వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఎడ్లబండ్లను అలంకారప్రాయంగా తయారు చేసుకొని రామాలయం ఎదుట ఉన్న గరుడ స్తంభం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, ఆలయ కమిటీ చైర్మన్ ఆవుల సతీష్, వైస్‌చైర్మన్ మామిడి మల్లయ్య, మంచినీళ్ల మహేందర్, చిరంజీవి, అనిల్, ఆలయ కమిటీ డైరెక్టర్లు మిరప అంజయ్య, గడ్డల ఉపేందర్, బెల్లంకొండ ఉప్పలయ్య, సల్ల రమేష్, సంపతి శంకరమ్మ, ఆలయ అర్చకులు సంతోష్‌కుమార్‌శర్మ, మాధవాచార్యులు, సాయి, దత్తు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బాలనాగమ్మ నాటకం



బాలనాగమ్మ నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని అంజలీపురంలో నిర్వహిస్తున్న అంకమ్మ, పెద్దమ్మతల్లి బొడ్రాయి వార్షికోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు స్థానిక చెన్నకేశవస్వామి నాట్యకళామండలి ఆధ్వర్యంలో బాలనాగమ్మ నాటకం ప్రదర్శించారు. ప్రముఖ హార్మోనిస్టు వినాయకరాజు ఆర్కెస్ట్రాతో నాటకాన్ని రక్తికట్టించారు. స్థానికులు గొర్రె నాగరాజు, గోలి శ్రీను, ఆదిరెడ్డి, పిచ్చిరెడ్డి తదితర గ్రామ పెద్దల సహకారంతో ప్రదర్శించిన ఈ నాటకంలో కళాకారులు ఎస్‌కే సైదులు, ధర్మయ్య గౌడ్, బీవీ రామారావు, పి. వెంకటేశ్వర్లు, హనుమారెడ్డి, ఉప్పు కృష్ణ, శివశంకరాచారి, నజీర్, విజయ్, నటీమణులు వీరమణి, అశ్విని, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

280 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



చిట్యాల: బియ్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిట్యాల: మండలంలోని వనిపాకల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 70 బస్తాలలోని 280 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి పట్టుకున్నట్లు చిట్యాల ఎస్ఐ నకిరేకంటి ధర్మా మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం పాచర్లబోడు తండాకు చెందిన బొంత వెంకటేష్ వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామ శివారులోని లెంకల సత్తిరెడ్డికి చెందిన శ్రీతేజ ఫామ్స్‌లో నిల్వ చేశాడు. సోమవారం రాత్రి ఈ నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని హైదరాబాద్‌కు చెందిన సన్నీకి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు చిట్యాల పోలీసులు దాడి చేసి 280 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బొంతు వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టుబడిన పీడీఎస్ బియ్యానికి పంచనామా..

డిండి: అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యానికి పంచనామా నిర్వహించినట్లు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల 18న నేరేడుగొమ్ము మండలం చిత్రియాల నుంచి అక్రమంగా 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లోడుతో డిండి వైపు వెళ్తున్న వాహనాన్ని పోలీసులు చెర్కుపల్లి గేటు సమీపంలో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పీడీఎస్ బియ్యానికి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో ఉన్నత స్థానాలకు..



మాట్లాడుతున్న రామకృష్ణ భరద్వాజ్

కోదాడఅర్బన్: విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా ముఖ్యమని, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, కృష్ణ గ్రూప్ సంస్థల చైర్మన్ రామకృష్ణ భరద్వాజ్ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణ పరిధిలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, ప్రేరణ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు బీటెక్ పూర్తయిన వెంటనే కార్పొరేట్ సంస్థల్లో పనిచేసేందుకు కావాల్సిన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థినులకు ఉద్యోగాల సాధనకు ప్రణాళికలు ఎలా సిద్ధం చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. విజయ్‌కుమార్, అకాడమిక్ అడ్వైజర్ పి. నాగేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. నాగార్జునరావు, వివిధ విభాగాధిపతులు స్రవంతి, ఏఓ కృష్ణారావు, అధ్యాపకులు నర్సింహారావు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

డిండి: మండల పరిధిలోని ఎర్రారం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రారం గ్రామానికి చెందిన గోరటి ప్రశాంత్ గత నెల 18వ తేదీన ఇంటి నుంచి బయట వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ప్రశాంత్ ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి తల్లి లక్ష్మమ్మ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. ప్రశాంత్ మానసిక పరిస్థితి సరిగ్గా లేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, మైహోం చైర్మన్ రామేశ్వరరావు తదితరులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం ఆరాధన కార్యక్రమం, ధ్వజారోహణం, సహస్రకమలార్చన, లక్ష కుంకుమార్చన, మంగళాశాసనం, ఎదుర్కోలు, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మైహోం సిమెంట్ పరిశ్రమ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతులు, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, కోదాడ మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, మునగాల రామ్మోహన్‌రావు, అరుణ దంపతులు, పరిశ్రమ హెడ్ శ్రీనివాసరావు, ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బత్తాయి రైతును ముంచుతున్న 'మంగు'

- నివారణకు నల్లగొండ ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మర్రి వెంకటేశం సూచనలు

పాడి పంట



చెట్టు మీద మంగు సోకిన కాయలు



మంగు సోకిన కాయలు

గుర్రంపోడు : బత్తాయి రైతులను ఈ సీజన్‌లో మంగు నిండా ముంచుతోంది. నల్లగొండ జిల్లాలో సాగవుతున్న 45వేల హెక్టార్ల బత్తాయి తోటల్లో ఎంతోకొంత మంగు ఆశించని తోట అంటూ లేదంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో చెప్పవచ్చు. కాయలపై వక్క లేదా ఊదా రంగు లేదా ముదురు గోధుమరంగు ఏర్పడటాన్ని మంగు అంటారు. ప్రస్తుతం సీజన్ బత్తాయి కాయలు మంచి సైజును సంతరించుకునే దశలో ఉన్నాయి. వాతావరణంలో మార్పులు, మబ్బులు, తరుచు చిరుజల్లులు పడటం వల్ల మంగు తీవ్రత ఈ ఏడాది ఎక్కువగానే ఉంది. ఈ దశలో బత్తాయిలో మంగును నివారించి విలువైన కత్తెర బత్తాయి పంటను కాపాడుకోవడంపై నల్లగొండ ప్రాంతీయ ఉద్యానవనశాఖాధికారి మర్రి వెంకటేశం అందిస్తున్న సలహాలు, సూచనలు.

నల్లి పురుగులతోనే..

బత్తాయి కాయలపై మంగు ఏర్పడటానికి ప్రధాన కారణం మంగునల్లి. ఈ నల్లులు కంటికి కనిపించనంత చిన్నవిగా ఉంటాయి. వీటిని భూతద్దంలో సులభంగా చూడవచ్చు. వీటి పిల్లలు పసుపు రంగులోనూ, పెద్ద నల్లులు ఆరంజి రంగులోనూ ఉంటాయి. పిల్ల, పెద్ద మంగు నల్లులు పిందెలు, కాయలపైన పారాడుతూ తొక్కల నుంచి రసం పీల్చుతాయి. రసాన్ని పీల్చే ప్రక్రియలో నల్లి నోటి నుంచి రసాయాన్ని వదులుతుంది. ఈ రసాయనం కాయతోలు నుంచి స్రవించిన ద్రవం, సూర్యరశ్మి మార్పు చెంది తుప్పురంగు మారుతుంది. అందుకే బయటకు కనిపించే, సూర్యర్శ్మి తగిలే కాయల్లో మంగు బాగా కనిపిస్తుంది. బత్తాయి పిందెలకు నల్లి ఆశిస్తే కాయ సైజు తగ్గదు కాని మంగు వచ్చి తోలు గట్టిపడి పెలుసుగా మారుతుంది. కాయ రుచిలో తేడా రాదు. అయినా మంగు కాయలకు తోలు గట్టిపడి పెలుసుగా మారి చూడటానికి నల్లగా కనిపిస్తున్నందున మార్కెట్‌లో ధర పలకదు. వ్యాపారులు కూడా తోటల్లో కొద్దిగా మంగు ఉన్నా చాలా ఎక్కువగా మంగు ఉందంటూ తక్కువ రేటుకు తీసుకుంటారు.

మంగు నల్లి నివారణ

రైతులు భూతద్దం సహాయంతో నల్లి ఉనికిపై నిఘా ఉంచాలి. ఒకటి, రెండు నల్లులు తోటలో ఎక్కడైనా పిందెలు, కాయలపై కనిపించగానే స్ప్రేయింగ్ మొదలు పెట్టాలి. రైతులందరూ సామూహికంగా నివారణ చర్యలు చేపట్టాలి. చెట్లలో కొమ్మల కత్తిరింపులు సక్రమంగా సకాలంలో చేసి చెట్టు లోపల గాలి వెలుతురు బాగా ప్రసరించేటట్లు చూడాలి. తోటల్లో ఎండు పుల్ల కత్తిరించిన వెంటనే లీటరు నీటికి 3గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలి. ఈ రాగి దాతువు శిలీంద్రనాశిని కత్తిరించిన కొమ్మలకు రక్షణ ఇవ్వడమేగాక నల్లికి ప్రతికూలంగా ఉంటుంది. మంగునల్లిపై ఇటీవల పరిశోధనా కేంద్రాల్లోనూ, రైతు పరిశీలనల్లో కొన్ని రకాల మందులు నల్లిని సమర్థవంతంగా అరికట్టినట్లు తెలిసింది. లీటరు నీటికి 2మిల్లీ లీటర్ల ప్రాపర్‌గైట్ లేదా ఒక గ్రాము డైపెంధిరాన్ లేదా రెండు మిల్లీ లీటర్ల ఇథియాన్ లేదా 5 మిల్లీ లీటర్ల డైకోఫాల్ వంతున కలిపి మందు మార్చుతూ అవసరాన్ని బట్టి వారానికి ఒకసారి చొప్పున రెండు ధపాలుగా చెట్టంతా తడిసేలా పిచికారీ చేయాలి. లీటరు నీటికి 5 గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పొటాష్, 5 గ్రాముల మల్టీకే ఒక మారు పిచికారీ చేస్తే నల్లిని అణిచివేయడంతోపాటు కాయసైజు నాణ్యత పెరగుతుంది. నీటి తడులు ఎక్కువ కాకుండా అవసరం మేరకు డ్రిప్ పద్ధతిలో అందించాలి. సిఫారసు మేరకు సమతుల సమగ్ర ఎరువులు సకాలంలో అందించాలి. తోటలో అంతర కృషి బాగా చేసి పరిశుభ్రతను పాటించాలి.

వాతావరణంలో మార్పులతో..

క్రమంగా వేడి వాతావరణం పెరిగే ఫిబ్రవరి, మార్చి నెలల మబ్బులు, వర్షాలతో కూడిన వాతావరణానికి మారుతున్న సమయం మంగు ఉధృతికి ఎక్కువగా దోహదం చేస్తాయి. అధిక వర్షానికి పురుగులు చెట్టు నుంచి జారి కిందపడి నశిస్తాయి. వర్షాలు తక్కువగా ఉంటే నల్లి పురుగులు చెట్లపైనే ఆవాసాన్ని ఏర్పరుచుకుని స్థిరంగా ఉంటాయి.